## క్లుప్తంగా

### కమిటీ ఎన్నిక

**లింగాలఘణపురం:** బండ్లగూడెం గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఎస్‌ఆర్‌కేఎస్)నూతన కమిటీని శనివారం జిల్లా ప్రచార కార్యదర్శి కుంటి బీమయ్య, మండల అధ్యక్షుడు జాగిళ్లాపురం రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్యాట రాములు, ఉపాధ్యక్షుడిగా గట్టగల్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మేడ నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా గట్టగల్ల చిన్న భిక్షపతి, కోశాధికారిగా గట్టగల్ల నర్సింహ్మ, గౌరవవ అధ్యక్షునిగా వల్లపు ఐలయ్య, సలహాదారునిగా భిక్షపతిలను ఎన్నుకున్నారు.

### కేంద్రమంత్రికి వినతి

**స్టేషన్‌ఘన్‌పూర్:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత విషయంలో బీజేపీ మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరుతూ మండలంలోని పాంనూర్‌లో కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. నాయకులు మల్లేష్, రాగల్ల ఉపేందర్, పైస రాజశేఖర్, జేరిపోతుల సుధాకర్, సందెన రవీందర్, కుమార్, ఏలియా పాల్గొన్నారు.

### అనాథ పిల్లలను ప్రభుత్వమే ఆదుకోవాలి

**స్టేషన్‌ఘన్‌పూర్:** అనాథ పిల్లలను ప్రభుత్వమే ఆదుకోవాలని, వారికి విద్య, సంరక్షణ, ఉపాధి, హక్కులు, అవకాశాలను అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్‌మాదిగ అన్నారు. అనాథల హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ బాధ్యుల ఆధ్వర్యంలో హన్మకొండలో ఎమ్మెల్యే రాజయ్యకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. మల్లేష్, ఉపేందర్, శ్రీనివాస్, సుధాకర్, రవీందర్, ఎల్లస్వామి, ఇసాక్ ఉన్నారు.

### సభావేదిక నిర్మాణం

**స్టేషన్‌ఘన్‌పూర్:** మండలంలోని నమిలిగొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్ తన తండ్రి పురమాని కొమురయ్య జ్ఞాపకార్థం రూ.50వేలతో సభావేదిక షెల్టర్ నిర్మాణం చేయించారు. పాఠశాలలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుకూలంగా ఉండేలా విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం సభావేదిక నిర్మాణం చేయించినట్లు ఎంపీటీసీ తెలిపారు. కాగా ఎంపీటీసీకి హెచ్‌ఎం కె.రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ జినుక అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**లింగాలఘణపురం:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశంతోపాటు, 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16వ తేదీన ఉంటుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు నీట్, ఐఐటీ పోటీ పరీక్షలకు అనుగునంగా, అద్భుతమైన మేధస్సు గల ఉపాధ్యాయ బృందంతో బోధన ఉంటుందని పేర్కొన్నారు.

### చీటింగ్ కేసు నమోదు

**లింగాలఘణపురం:** నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న కారును సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేయడమే కాకుండా తిరుమలగిరికి చెందిన నారబోయిన సురేశ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. శనివారం నెల్లుట్ల వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా సురేశ్ కారు వెనుక ముందు నంబర్ ప్లేట్లు తీసివేసి నడుపుతుండగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### డీసీఎం వ్యాన్ బోల్తా

**స్టేషన్‌ఘన్‌పూర్:** భువనగిరి నుంచి హనుమకొండకు తోళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు సమీపాన జాతీయ రహదారిపై శనివారం బోల్తాపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహమ్మద్ బాషిత్ అనే వ్యక్తి భువనగిరిలో గొర్రెలు, మేకల తోళ్ల లోడ్ వేసుకుని మినీ డీసీఎం వ్యాన్‌లో హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఘన్‌పూర్ శివారులో వ్యాన్ టైర్ పంక్చర్ అయి పేలడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

### గుండెపోటుతో ఉపాధికూలీ మృతి



**నర్మెట:** గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఆగాపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన వల్లంపట్ల ఆగయ్య (70) హరితహారం మొక్కలకు వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం మొక్కలకు నీరుపట్టి కలుపు మొక్కలను తొలగించి ఇంటికి చేరుకున్న ఆయన చాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గం మధ్యలోనే మృతిచెందాడు. ఆగయ్యకు భార్య దేవలమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. బాధిత కుటంభాన్ని ప్రభ్వుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# దేశానికే ఆదర్శం తెలంగాణ

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ప్రజాప్రతినిధులు

**జనగామ రూరల్:** ఉమ్మడి రాష్ట్రంలో అనేక అవస్థలు పడిన తెలంగాణ నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. శనివారం జనగామ మండలంలోని గానుగుపహాడ్ నుంచి మద్దూరు వరకు రూ.1.5కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సీఎం కృషితో నేడు అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. రాష్ట్రంలో పథకాల అమలు పట్ల కేంద్రం మంత్రులు ప్రశంసా పత్రాలు అందించారని తెలిపారు. కేంద్రం తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక సంక్షేమ పథకాలు బంద్ చేయాలని అనడం సరికాదన్నారు. దేశ సంపదను రాష్ట్రాలకు వాటా పంచాల్సిందే అని డిమాండ్ చేశారు. ఖమ్మంలో నిర్వహించిన సభను చూసి, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్‌తో కలిసి ముందుకు నడుస్తామంటున్నారని, భవిష్యత్‌లో కేసీఆర్ ప్రధాని అయి.. ఎర్ర కోటపై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం అని అన్నారు. సర్పంచ్ శానబోయిన శ్రీనివాస్, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొల్లం శారద, జిల్లా నాయకుడు బాల్దె సిద్దిలింగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఐలయ్య, ఎంపీటీసీ రెడ్డ బొయిన పద్మ బాలస్వామి పాల్గొన్నారు.

# పింఛన్ సౌకర్యం కల్పించాలి



నూతన కమిటీతో కొమురయ్య

**రఘునాథపల్లి:** దుర్భర జీవితాలు గడుతుపున్న భవన నిర్మాణ రంగాల కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఖిలాషాపూర్‌లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ 5 వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులకు ఈఎస్ఐ, జీవితకాలం కార్డులు అందజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో కార్మికులు ఐక్యమత్యంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన గ్రామ కమిటీలో అధ్యక్షుడు తాడూరి సత్యం, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి గంధమల్ల యాదగిరి, ప్రచార కార్యదర్శి కందికొండ రాజులచే నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం నాయకులు శాగ కుమార్, కాగితాల లక్ష్మీనారాయణ, యాదగిరి, రాములు, శ్రీనివాస్, అంజనేయులు, వెంకటస్వామి, నాగరాజు, నరసింహులు, సోమయ్య, ప్రభాకర్, కుమారస్వామి, శేఖర్, కొమురయ్య, ఎల్లయ్య, పర్వతాలు, కిష్టయ్య, అమృనాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

### 26న అక్షరాభ్యాసం

**జనగామ:** వసంత పంచమి పురస్కరించుకుని జనగామ పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఈ నెల26వ తేదీన సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరుగుతుందని స్కూల్ కార్యదర్శి జైన రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు ముందుగానే పాఠశాలలో తమ పేర్లను రిజిస్ట్రేషన చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9441702686, 9849425114 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### అంగడి వేలానికి ఈ- టెండర్లు

**లింగాలఘణపురం:** మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ పరిధిలో ప్రతి శనివారం జరిగే అంగడిలో పశువులు, గొర్రెలు, మేకల క్రయ విక్రయ రహదారి నిర్వహణకు ఈ-టెండర్లతో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ శేషుభారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టెండర్.తెలంగాణ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ నందు టెండర్ దాఖలు చేసుకోవాలని, అదే రోజు మధ్యాహ్నం12 గంటలకు టెండర్ ఓపెన్ చేయబడుతుందని తెలిపారు. రూ.5వేల షెడ్యూల్ డీడీ. రూ.3లక్షల దరావత్తు జతపరుచాల్సి ఉంటుందని, 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 2024 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు.

### నోట్‌బుక్స్ అందజేత

**నర్మెట:** మండలంలోని వెల్దండకు చెందిన జంగా లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం రూ.10 వేల విలువ చేసే 200 లాంగ్ నోటు పుస్తకాలు ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, హెచ్‌ఎం ఐ. వెంకట్ రెడ్డి మాట్లాడారు. వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఎస్సెమ్సీ చైర్మన్ లక్ష్మి రాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### దేవస్థాన అభివృద్ధికి పాటుపడాలి

**కొడకండ్ల:** పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవస్థాన అభివృద్ధి కోసం మండలం నుంచి ఎన్నికై న డైరెక్టర్లలంతా పాటుపడాలని మార్కెట్ చైర్మన్ పేరం రాము కోరారు. శనివారం దేవస్థాన డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మండలకేంద్రానికి చెందిన కొటగిరి కుమార్‌గౌడ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

# కుమ్మరులను పూజారులుగా నియమించాలి

**పాలకుర్తి టౌన్:** గ్రామ దేవాలయాల్లో కుమ్మరులను పూజారులుగా నియమించి, 'దళిత బంధు' మాదిరిగా 'కుమ్మరి బంధు' అమలు చేయాలని కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం నియోజవకర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు కేటాయించాలన్నారు. అనంతరం నియోజవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏనుగుతల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏనుగుతల ఉపేందర్, రాష్ట్ర కార్యదర్శిగా నాల్లపురం యాకయ్య, కమ్మరికుంట పర్యవేక్ష కన్వీనర్‌గా నార్లపురం నాగరాజ్ ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుగుతల యాదగిరి, యూత్ ప్రధాన కార్యదర్శి ఏదూనూరి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు, ఏదనూరి రజనీకాంత్, పట్టణ అధ్యక్షుడు ఎనుగతల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు

**దేవరుప్పుల:** ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టవద్దని తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని దారావత్‌తండా నుంచి ధర్మగడ్డతండా శివారులోని ఓ మిల్లుకు అక్రమ మట్టి తరలింపు సమాచారం మేరకు ఆర్‌ఐ రాజు వెళ్లి ఆపివేశారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ భూముల్లో సైతం తగిన అనుమతులు ఉంటే తప్ప ఇష్టానుసారంగా మట్టి తరలించే వీలులేదన్నారు. ఇసుక, మట్టి వంటి సహజసిద్ధమైన వనరులను పరిరక్షించుకోకుంటే భవిష్యత్‌లో అనేక నష్టాలు చవిచూడాల్సి వస్తుందని అన్నారు.

# సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా



సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ రవి

**చిల్పూరు:** గ్రామంలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వార్డుల పర్యటన చేపట్టినట్లు సర్పంచ్ ఏదునూరి రవీందర్ తెలిపారు. మండలంలోని లింగంపల్లిలో శనివారం ప్రజాసమస్యలు–వార్డుల పర్యటన పేరుతో 2వ వార్డులో ఉప సర్పంచ్ కంకటి రాజన్న, 2వ వార్డు సభ్యుడు రాజన్నతో కలిసి ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడారు. వార్డు సభ్యులు రచ్చ కృష్ణవేణి, గాజుల రజిని, కండ్లకోలు బాలరాజు, గొడుగు ఎల్లయ్య, కందుకూరి రమ, తుత్తురు రజిత, ఆవుల మంజుల, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కారోబార్ రొయ్యల నర్సింహులు, చాతెల్లి రజాక్, అంగన్‌వాడీ శోభ సిబ్బంది పాల్గొన్నారు.

# పనుల పరిశీలన



**చిల్పూరు:** మండల కేంద్రంలో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిధులు మంజూరు చేయగా ఆ నిధులతో చేపట్టిన పనులను శనివారం ఎంపీపీ సరితబాలరాజు, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తి చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామని అన్నారు. నాయకులు భువనగిరి స్వామి, ఆవుల లింగయ్య, దోకి శ్రీనివాస్, బుర్ర లింగయ్య, దారం సత్యనారాయణ, దామెర వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# అవినీతిపై విచారణ చేపట్టాలి

**జఫర్‌గఢ్:** జఫర్‌గఢ్ మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సింగిల్ విండో వైస్ చైర్మన్ మొగిళిపాక నర్సింగం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2022 వరకు జఫర్‌గఢ్ మేజర్ జీపీ అభివృద్ధి పనులకు సంబధించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయకుండా దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్ సంబంధిత అధికారులు కలసి సుమారు రూ.25 లక్షలు కాజేశారన్నారు. ఇదే విషయంపై అఖిపక్ష సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు జ్యోతి రజిత యాకయ్య, స్రవంతి మొగిళి, వార్డు సభ్యులు సుధాకర్, కుక్కల ఎల్లయ్య, సారంగం, రమేష్, అయేషాబేగం, టీ కొమురమ్మ, రైతు బంధు గ్రామ కోఆర్డినేటర్ సోమశేఖర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్, రాజు, సీపీఎం మండల కార్యదర్శి సోమయ్య, నాయకులు ఉన్నారు.

### పలకలు, బూట్ల పంపిణీ



**పాలకుర్తి:** పెద్దతండా (కె) పాఠశాల విద్యార్థులకు షూస్, పలకలు శనివారం సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో పలువురు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన లావుడ్య శ్రీను. లావుడ్య అనిల్, గుగులోత్ విజయ్, గుగులోత్ నరహరి కలిసి రూ.13 వేల విలువ గల పలకలు, బూట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంఘం భూమిని ఆక్రమించారని ఆవేదన



మాట్లాడుతున్న కురుమలు

**బచ్చన్నపేట:** మండలంలోని కేశిరెడ్డిపల్లి, బోకొల్లూర్ కురుమ కులస్తులకు ప్రభుత్వం కేటా యించిన అసైన్డ్ భూమిని సంఘంలోని వ్యక్తి అక్రమపట్టా చేసుకుని తనదేనంటూ బెదిరిస్తున్నాడని రెండుగ్రామాల కురుమ కులస్తులు శనివారం ఆవేదన వ్యక్తచేశారు. ఈ సందర్భంగా శనివారం జక్కుల రాజయ్య, బాల లింగయ్య, మీస శ్రీనివాస్ మాట్లాడుతూ కేశిరెడ్డిపల్లి శివారులోని సర్వే నం. 268లో గల 12 ఎకరాల భూమిని 1975లో ప్రభుత్వం గొల్లకురుమల జీవాల కంచె కోసం సొసైటీ పేరున కేటాయించిదని అన్నారు. కాగా, జీవాల కంచెకు ఉపయోగిస్తున్న సదరు భూమిని సంఘంలో బాధ్యురాలైన జక్కుల లచ్చమ్మ భర్త మల్లయ్య, అల్లుడు చిమ్మ అంజయ్య ఆర్వోఆర్ ద్వారా వీఆర్వోతో కుమ్మక్కై సభ్యులకు తెలియకుండా అక్రమ పట్టా చేయించుకున్నారని, అలాగే కుల సంఘం పొదుపుకు సంబంధించిన చిట్టీ నుంచి రూ. 8 లక్షలు కాజేయడంతో పాటు సభ్యులను బెదిరిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామని తక్షణం స్పందించి న్యాయం చేయాలని నవీన్, శ్రీనివాస్, ఐలయ్య, సత్యనారాయణ, కనకయ్య, పోషయ్య, వీరమల్లు, నరసింహులుతోపాటు కురుమ సంఘం సభ్యులు కోరుతున్నారు.

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తరిగొప్పుల: పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఈఓ

**దేవరుప్పుల:** వరిపంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి ఎర్ర రాజు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కారుపోతుల భిక్షపతి, అంజయ్య వరి పంట క్షేత్రాలను ఏఈఓ సూదగాని సాగర్‌తో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

**చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి**

**తరిగొప్పుల:** వరిని ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ధరావత్ సంతోషి తెలిపారు. మండలంలోని బొత్తలపర్రె, బొంతగట్టునాగారంలో శనివారం ఏఈఓ ప్రశాంత్‌తో కలిసి వరి పొలాలను పరిశీలించిన ఆమె రైతులకు పలుసూచనలు చేశారు. ఖరీఫ్ చివరిదశలో ఆశించిన కాండం తొలుచు పురుగు ( మొగి పురుగు) పంటకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. నివారణకు క్లోరాన్ ట్రినిప్రోల్ 0.6%, లేదా కార్టేఫెడ్రా క్లోరైడ్ గుళికలను పొలంలో చల్లు కోవాలని నాట్లు వేసి 45 రోజులు దాటితే కార్టేఫైడ్రా క్లోరైడ్ పౌడర్‌ను 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరిచేను ఎర్రబారి ఎండిపోతే స్ట్రెప్టోమైసిన్ మందును పిచికారీ చేసి మరుసటి రోజు పొటాష్ ఎకరాకు 15 కేజీలు చల్లాలని, ఉధృతి తగ్గిన అనంతరం ఫార్ములా–4 స్ప్రే చేయాలని ఆమె సూచించారు. రైతులు రాజు, శ్రీనివాస్, బాలాజీ ఉన్నారు.

# మోడల్ స్కూల్‌కు టీవీ వితరణ



**నర్మెట:** ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఎస్ఐబీటీ ఫౌండేషన్ సంస్థ హెచ్‌పీ ముస్కాన్ స్కూల్ డిజిటలైజేషన్ లో భాగంగా స్థానిక మోడల్ స్కూల్‌కు ఎల్ఈడీ టీవీ, ల్యాప్‌టాప్, ప్రింటర్లను అందజేశారు. కాగా, కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కందకట్ల ఉపేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రిన్సిపాల్ శరత్ కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులను అనుసరించి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వేముల సదానం, వార్డు సభ్యుడు పొన్నం బాలకృష్ణ, ఐబీఎం ప్రాజెక్ట్ ఉపాధ్యాయులు బానోత్ హేమలత, పసుపులేటి ఉపేందర్, అనీస్ ఫాతిమా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ రడపాక సుదర్శన్

**జఫర్‌గఢ్:** పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ)లో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. తమ్మడపల్లి (ఐ)లో 25 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు ఇందులో 14 పూర్తయ్యాయని అన్నారు. వీటిని అర్హులైన పేదలకు కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో పూర్తైన 14 ఇళ్లకు ఎస్సీలకు –7 మైనార్టీకి–1, మిగతా –6 ఇళ్లను బీసీలకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేశారు. తహసీల్దార్ స్వప్న, ఆర్ఐలు కృష్ణ, అనిల్‌బాబుతో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మృతులకు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న జిల్లా ఫొటోగ్రాఫర్లు

**జనగామ రూరల్/బచ్చన్నపేట/దేవరుప్పుల/రఘునాథపల్లి:** ఉమ్మడి వరంగల్ జిల్లా యువ ఫొటో గ్రాఫర్లు రాము, కళ్యాణ్, శివ, అరవింద్ భద్రాద్రి జిల్లా కోటిలింగాల మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా, వారి ఆత్మకు శాంతి కలగాలని శనివారం జిల్లా కేంద్రంలోని ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో, బచ్చన్నపేట, దేవరుప్పుల, రఘునాథపల్లిలో ఫొటోగ్రాఫర్లు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అకాలమరణం పొందుతున్న ఫొటోగ్రాఫర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవా లన్నారు. జి.చంద్రప్రకాష్, ప్రవీణ్,వెంకటేశ్వర్లు, కృష్ణ, వేణుమాధవ్, సూత్రమే రమేష్, కార్యదర్శి నీల కుమారస్వామి, సదానందం, శాంతయ్య, ప్రసాద్, గణేష్, నర్సింహులు, సిద్దేశ్వర్, అమృతం, వీరునాయక్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**విభజన హామీల అమలులో విఫలం**

**జనగామ రూరల్:** రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళంపల్లి జనార్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలకు ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం హామీలను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సాయన్న, శ్రీనివాస్, సోమయ్య, సదానందం, యాదగిరి పాల్గొన్నారు.

**అర్బన్, రూరల్ మండలాలు ఏర్పాటు చేయాలి**

**జనగామ రూరల్:** జనగామను అర్బన్, రూర ల్ మండలాలుగా ఏర్పాటు చేయాలని జిల్లా జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ మేకల కళింగరాజుకు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు తుంగ కౌశిక్, ప్రవీణ్, అజయ్, అనిల్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా వార కల్యాణం**

**చిల్పూరు:** శ్రీబుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సమక్షంలో అర్చకులు వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించగా.. హనుమకొండకు చెందిన తిరునగరి వేందాంతస్వామి–మాధవి దపంతులు అన్నప్రసాదం సమకూర్చారు.

**ఆర్థికసాయం**

**దేవరుప్పుల:** మండల కేంద్రంలో బాల్యమిత్రుడు చింత సాగర్ తండ్రి రామయ్య అనారోగ్యంతో మృతి చెందగా స్నేహితులు శనివారం రూ.14,500 ఆర్థిక సాయం అందజేసి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ యాదగిరి, వెంకటేష్, నాగరాజు, క్రాంతి ఉన్నారు.

**నెల్లుట్లలో..**

**లింగాలఘణపురం:** నెల్లుట్లలో ఇటీవల మృతి చెందిన ఎండీ.జానీ, గొరిగె శ్రీనివాస్ కుటుంబాలను శనివారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. సర్పంచ్‌ల ఫోరం మండ ల అధ్యక్షుడు గణపతి, వీరస్వామి, బాలరాజు, గంగాధర్, రాజశేఖర్, నాగేందర్, శ్రీహరి తదితరులున్నారు.

**బ్లాంకెట్లు, ప్లేట్ల పంపిణీ**

**జఫర్‌గఢ్:** మండల పరిధి రఘునాథ్‌పల్లిలో లయన్స్ క్లబ్ స్టేషన్‌ఘన్‌పూర్ ఆధ్వర్యంలో అమంచ అచింత్య మధుసూదన్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు బ్లాకెట్లు, అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్స్, బిస్కెట్లు, పండ్లు శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీదేవిపెద్దిరెడ్డి, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, విజయ్‌చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నియామకం**

**చిల్పూరు:** రాజవరానికి చెందిన ఇల్లందుల వెంకటస్వామిని బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శనివారం ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య నియమించారు.

**కంప్యూటర్ బహూకరణ**

**కొడకండ్ల:** మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం కంప్యూటర్‌ను బహూకరించారు. హెచ్‌ఎం గ్రేస్‌కేజీయారాణి, సోమన్న ఉన్నారు.

**వసతులు కల్పించాలి**

**బచ్చన్నపేట:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కనీస వసతులను కల్పించాలని బండనాగారం సర్పంచ్ శివరాత్రి కవిత అన్నారు. శనివారం గ్రామంలోని వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్టాటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవిత మాడారు. పంచాయితీ కార్యదర్శి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

**నిత్యావసర సరుకుల అందజేత**

**జనగామ రూరల్:** పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నిరుపేద మహామ్మద్ యాకూబ్‌కు ముస్లిం మైనార్టీ నాయకుడు యాకూబ్ పాషా శనివారం నిత్యవసర సరుకులు అందజేశారు.

**సన్మానం**

**దేవరుప్పుల:** శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ పాలకుర్తి పాలకమండలి సభ్యులుగా నియమాకమైన తీగల సత్తయ్య(దేవరుప్పుల)ను బీఆర్ఎస్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, బస్వ మల్లేషమ్, పల్ల సుందర్‌రామిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ సోమయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, డైరెక్టర్ భిక్షపతి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

**ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి**

**రఘునాథపల్లి:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శ్రీమహాదేవస్వామి ఆలయ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ అన్నారు. శనివారం స్థానిక మహాదేవస్వామి ఆలయంలోని శ్రీఆంజనేయస్వామికి వేదపండితులు పిండిపోలు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

# పేదలకు పట్టాలు ఇవ్వాలి

**జనగామ రూరల్:** పేదలు చేస్తున్న పోరాటాలను గుర్తించి వారి ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చి హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం సింగారపు రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించడం వల్లే ప్రజలు పోరాటాలకు పూనుకుంటున్నారని చెప్పారు. పట్టణంలో నిలువ నీడలేని పేదలు ఆందోళనలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే స్థలాల సమస్య పరిష్కరించాలని, లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 'దళిత బంధు' అమలులో జరుగుతున్న అక్రమాలను అరికట్టి దళితులందరికీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రాజం, కుమారస్వామి, ఉపేందర్, సోమసత్యం, మహేందర్, సుధాకర్, కిష్టయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.